సీసీ రోడ్డు పనుల ప్రారంభం

కీసర: నాగారం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషిచేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం బౌద్ధనగర్‌కాలనీ, శివసాయి ఎన్‌క్లేవ్‌లో రూ. 5 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... అన్ని వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లామన్నారు. కౌన్సిలర్ అన్నంరాజు లావణ్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అకారణంగా దాడి చేసిన వారిపై కేసు

ఘట్‌కేసర్: అకారణంగా ఓ యువకుడిపై దాడి చేసిన వారిపై ఘట్‌కేసర్ పీఎస్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ సైదులు సమాచారం మేరకు... పట్టణానికి చెందిన సూర్యప్రకాశ్‌రెడ్డి శనివారం రాత్రి స్థానిక ఆదర్శ (7 హిల్స్) బార్‌కు వెళ్లి బీరు కొనుగోలు చేశాడు. అనంతరం సిగరేట్, బీరు తాగుతూ బయట ఉన్న పార్కింగ్ ప్రదేశానికి వచ్చాడు. అదే సమయంలో ఓ ఎరుపు రంగు కారును డ్రైవర్ అశ్రద్ధగా, ఉద్దేశపూర్వకంగా వచ్చి ఆ యువకుడి కారు ముందు అడ్డుగా నిలిపాడు. ఇదేమిటని ప్రశ్నించగా కారు డ్రైవర్‌తో పాటు అతడి స్నేహితులు శేఖర్ (రాజశేఖర్), వేముల వినోద్ తదితరులు సూర్యప్రకాశ్‌రెడ్డిపై దాడి చేశారు. ఫలితంగా అతడి ముఖం, కళ్లకు గాయమై నోటి నుంచి రక్తస్రావమైంది. దీంతో దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

పలు గ్రామ పంచాయతీల కనుమరుగు!

- మొత్తం 61 గ్రామాలు
- కనుమరుగు కానున్న 23 గ్రామ పంచాయతీలు
- మిగతా 38 గ్రామాలుంటాయా అనే అనుమానాలు
- నియోజకవర్గంలో కనుమరుగు కానున్న ఘట్‌కేసర్, కీసర మండలాలు
- ఇకపై అర్బన్ జిల్లాగా మేడ్చల్–మల్కాజిగిరి



మేడ్చల్ నియోజకవర్గ చిత్రం

మేడ్చల్: నగర విస్తరణలో భాగంగా మేడ్చల్ నియోజకవర్గంలోని పలు గ్రామ పంచాయితీలు ఇకపై అదృశ్యం కానున్నాయి. నియోజకవర్గం పరిధిలో మేడ్చల్, కీసర, ఘట్‌కేసర్, శామీర్‌పేట్, మూడు చింతలపల్లి మండలాల్లో కలిపి 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మేడ్చల్ మండలంలో 17, ఘట్‌కేసర్ మండలంలో 11, కీసర మండలంలో 10, శామీర్‌పేట్‌లో 10, మూడు చింతలపల్లి మండలంలో 13, గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం ఐదు మండలాల్లో 61 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 23 గ్రామ పంచాయతీలు సమీప మున్సిపాలిటీల్లో, హైదరాబాద్ నగర పాలక సంస్థలో విలీనం చేసేందుకు ఇటీవలే గ్రామ సభలు నిర్వహించి గ్రామాల ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు.

- మేడ్చల్ మండలంలో 4 గ్రామాలు, శామీర్‌పేట్ 3, ఘట్‌కేసర్‌లో 8, కీసరలో 8 గ్రామాలను విలీనం చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.
- మేడ్చల్ మండలంలో విలీనం పోను 14 పంచాయతీలు, కీసర మండలంలో రెండు, ఘట్‌కేసర్‌లో 3, కీసరలో 2 గ్రామాలు మాత్రమే గ్రామ పంచాయతీలుగా మిగలనున్నాయి.
- ఘట్‌కేసర్ మండలంలో 11 గ్రామ పంచాయతీలుండగా అందులో 8 విలీనం చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మూడు గ్రామాలైన అవుషాపూర్, అంకుషాపూర్, మాదారం గ్రామాలు మాత్రమే మండల పరిషత్‌లో మిగులుతున్నాయి. కీసర మండలంలో 10 గ్రామ పంచాయతీలకు గాను 8 గ్రామాలు విలీనం చేయనున్నారు.
- భోగారం, అంకిరెడ్డిపల్లి మాత్రమే మండల పరిషత్ కింద మిగులుతున్నాయి. దీంతో మొత్తం 5 గ్రామాలకు మండల పరిషత్ వ్యవస్థ కొనసాగించే అవకాశం ఉన్నందున ఈ రెండు మండలాలు మేడ్చల్ చరిత్ర నుంచి మాయం కావడం కచ్చితంగా కనిపిస్తుంది.
- మండల వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి కీసర, ఘట్‌కేసర్ మండలాలుగా ఉన్నాయి. నగర విస్తరణ కోసం ఏకంగా రెండు మండలాలు చరిత్ర పటంలో లేకుండా పోవడం కలవరపరిచే అంశం.

ఐదు గ్రామాలు ఎటువైపు...

రెండు మండలాల్లో మిగిలిన 5 గ్రామాల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. అవుషాపూర్, అంకుషాపూర్, మాదారం గ్రామాలు, కీసర మండలంలో మిగిలిన గ్రామాలు భోగారం, అంకిరెడ్డిపల్లి గ్రామాలు శివారు జిల్లా యాదాద్రి భువనగిరికి దగ్గరగా ఉండటంతో ఆ మూడు గ్రామాలను ఆ జిల్లాలో విలీనం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

- ఘట్‌కేసర్ మండలంలోని గ్రామాలు బీబీనగర్ ఎయిమ్స్ కు దగ్గరగా ఉండటంతో అటువైపు ఆగ్రామాలను తీసుకెళ్ళే ఆలోచనలో ప్రభుత్వ పెద్దలు ఉన్నట్లు తెలిసింది.

మున్సిపాలిటీలుగా కానున్న గ్రామ పంచాయతీలు..

శామీర్‌పేట్ మండలంలో మిగిలిన 7 గ్రామాలను అలియాబాద్ కేంద్రంగా మార్చి మున్సిపాలిటీ గా, మేడ్చల్ మండలంలో జాతీయ రహదారి ఇరువైపులా ఉన్న గ్రామాలను డబీల్‌పూర్ కేంద్రంగా ఒక మున్సిపాలిటీ, రావల్‌కోల్ కేంద్రంగా మరో మున్సిపాలిటీ ఏర్పాటు చేయనున్నట్లు అధికార వర్గాల అనధికార సమాచారం.

- మేడ్చల్ మండలంలో డబీల్‌పూర్, రావల్‌కోల్, శామీర్‌పేట్ మండలంలో అలియాబాద్, మూడు చింతలపల్లిలో మూడు చింతలపల్లి మున్సిపాలిటీలుగా మారనున్నాయి.
- నూతనంగా నాలుగు మున్సిపాలిటీ ఏర్పాటుతో మేడ్చల్ నియోజకవర్గంలో గ్రామ పంచాయతీల జాడ పూర్తిగా లేకుండా పోతుండటంతో మేడ్చల్ జిల్లా అర్బన్ జిల్లాగా మారనుసంది. జిల్లాలో ఉన్న 5 నియోజకవర్గాలైన కూకట్‌పల్లి, ఉప్పల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్‌లలో ఇప్పటికే గ్రామాలు లేవు.
- ఆ నాలుగు నియోజకవర్గాలు జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్నాయి. మేడ్చల్‌లో మాత్రం 61 పంచాయతీలు, 5 మండల పరిషత్‌లు, 5 జెడ్పీటీసీలు ఉండగా తాజా గా రూపొందిస్తున్న ప్రతిపాదనలతో నియోజకవర్గంలో గ్రామాలు లేకుండా పోతుండటంతో కేవలం జీహెచ్‌ఎంసీ, మున్సిపాలిటీల పాలన ఉండనుండటంతో మేడ్చల్ జిల్లా గ్రామాలు లేని జిల్లా గా మారనుంది.
- గతంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్‌లు, మేయర్లు, జిల్లా పరిషత్ చైర్మన్, ఎంపీపీలు ఇలా వ్యవస్థలోని అన్ని పాలనలకు నెలవుగా ఉన్న మేడ్చల్ ఇకనై కేవలం కార్పొరేటర్, కౌన్సిలర్‌ల పాలనకు మారనుంది.

విద్యుదాఘాతంతో గేదె మృతి



మేడ్చల్‌రూరల్: విద్యుదాఘాతానికి గురైన ఓ గేదె మృతి చెందిన సంఘటన మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలివీ... గ్రామానికి చెందిన నాగిరెడ్డి తన వ్యవసాయ పొలం వద్ద గేదెలు మేపుతున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ స్తంభం సమీపంలో గడ్డి మేస్తున్న గేదెకు ప్రమాదవశాత్తు తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురైంది. దీంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో తనకు సుమారు రూ. 80 వేల నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు .

అనుమానాస్పదన స్థితిలో వ్యక్తి మృతి



సాయికుమార్ (ఫైల్)

కీసర: కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మరణించాడు. కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య సమాచారం మేరకు... యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం అనంతారం గ్రామానికి చెందిన సాయికుమార్(27) కీసరలోని జయభేరీ మారుతి షోరూంలో సర్వీస్ అడ్వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 22న ఇంటి నుంచి కీసరలోని మారుతి షోరూంకు వచ్చిన సాయి కుమార్ సాయంత్రం విధులు ముగించుకున్న తరువాత ఇంటికి చేరుకోలేదు. దీంతో కంగారు పడ్డ కుటుంబ సభ్యులు రాత్రి వరకు సాయికుమార్ ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేనందున పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ఆదివారం ఉదయం బర్సిగూడ గ్రామ సమీపంలోని బట్లకుంట బావి వద్ద ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బావిలోంచి ఆ మృతదేహాన్ని వెలికి తీసి మృతుడు సాయి కుమార్‌గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

మెట్రో పెయిడ్ పార్కింగ్‌ను శాశ్వతంగా ఎత్తివేయాలి



ధర్నా చేస్తున్న పీవైఎల్ సంస్థ ప్రతినిధులు

ఉప్పల్: మెట్రోస్టేషన్లలో పెయిడ్ పార్కింగ్ తాత్కాలిక వాయిదా కాదని, పెయిడ్ పార్కింగ్‌ను పూర్తిగా ఎత్తివేయాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్) డిమాండ్ చేసింది. ఈ మేరకు పెయిడ్ పార్కింగ్ వ్యవస్థను పూర్తి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఉప్పల్ మెట్రోస్టేషన్ వద్ద ప్రయాణికులతో కలిసి ధర్నా నిర్వహించారు. మెట్రో యాజమాన్యం ధనార్జనే ధ్యేయంగా కాకుండా సాధారణ ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కే.ఎస్. ప్రదీప్ మాట్లాడుతూ.. మెట్రోరైల్ ప్రయాణంపై ఎంతో మంది ఆధారపడి ప్రయాణిస్తున్నారని రైలు ప్రయాణంతో పాటు ఇప్పుడు పార్కింగ్ భారం ప్రయాణికుల మీద పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్కింగ్ స్థలంలో కనీస వసతులు కల్పించాలని, షెడ్ నిర్మించి పార్కింగ్‌కు మార్కింగ్ చేయాలని సూచించారు. లేని పక్షంలో సంస్థ మెండి వైఖరి ప్రదర్శిస్తే పెద్దఎత్తున ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వృక్షా రక్షాబంధన్ ర్యాలీ

అల్వాల్: వృక్షా రక్షాబంధన్ సందర్భంగా ఆదివారం పర్యావరణ సంరక్షణ గతివిధి ఆధ్వర్యంలో అల్వాల్ బతుకమ్మ పార్కు నుంచి పలు కాలనీలో పాదయాత్ర, సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. మల్లికార్జున్, గోపాల్‌రావు, కిషన్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, జగన్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో టోర్నీ



విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న హనుమంత్, లింగంముదిరాజ్

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో మొదటి ఓపెన్ తెలంగాణ రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్–2024ను ఆ క్రీడల కార్యనిర్వాహక కార్యదర్శి కె.పి.హనుమంత్ ఆధ్వర్యంలో ఆదివారం సందడిగా నిర్వహించారు. పోటీల్లో తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుంచి 376 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా తైక్వాండో గ్రాండ్‌మాస్టర్ జయంత్‌రెడ్డి, ప్రముఖ సంఘ సేవకుడు జవాది లింగం ముదిరాజ్ హాజరై విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమం ఎ.నాగరాజు, పి.నాగరాజ్, అర్జున్, అబ్దుల్లా, క్రీడాకారులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సమస్యను పరిష్కరించాలని వినతి



ఎంపీ ఈటలకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో నెలకొన్న వక్ఫ్‌బోర్డు సమస్యను పరిష్కరించాలని కోరుతూ.. ఆదివారం బీజేపీ నేతలు, రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ పోరాట సమితి సభ్యులు ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. క్రయవిక్రయాలు ఆగిపోవడం వల్ల ఇంటి యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనికి ఎంపీ సానుకూలంగా స్పందించి కేంద్ర ప్రభుత్వం వేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ దృష్టికి ప్రత్యేకంగా తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. 19వ డివిజన్ కార్పొరేటర్ సామల పవన్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి తలారి రవి, నాయకులు ఏనుగుల లక్ష్మయ్య, పోరాట సమితి సభ్యులు మహేష్ దూబె, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

విద్యతోనే విజ్ఞానం.. ఉజ్వల భవిత



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమంలో నేతలు

ఘట్‌కేసర్: చదువుతోనే జ్ఞానం లభిస్తుందని తద్వారా ఉజ్వల భవిత, హక్కులను సాధించుకోవచ్చని ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ధర్మారెడ్డి అన్నారు. ఆదివారం అంబేడ్కర్ ఆలోచన విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ బాధ్యుడు మీసాల అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కొలంబియా యూనివర్సిటీలో అంబేడ్కర్ 18 డిగ్రీలు అభ్యసించడంతో ప్రపంచ మేధావిగా గుర్తించి ఆయన విగ్రహం ఏర్పాటు చేశారన్నారు. చదువుకోవాలని అనుకున్న వారికి చేయూతనందించి జ్ఞానవంతులను చేయాలన్నారు. సమసమాజ నిర్మాణం కోసం అందరం భాగస్వామ్యం కావాలన్నారు. నేతలు దాసు, నర్సింగ్‌రావు, రాజేశ్‌కుమార్, అంజయ్య, నవీన్‌కుమార్, ఆనంద్, ఉపేందర్, విష్ణు, భరత్, సచిన్, ప్రవీణ్, అఖిల్ పాల్గొన్నారు.

‘స్వర్ణ మహానంది’ పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకున్న వెంకటగణేష్‌బాబు

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీకి చెందిన వెంకటగణేష్ బాబు జీవన సాఫల్య, స్వర్ణ మహానంది పురస్కారాన్ని అందుకున్నారు. ఈ మేరకు ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ సంస్కృతి సాహితీసేవ ట్రస్టు, తెలంగాణ సంస్కృతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో ఆయనకు ఈ జాతీయ పురస్కారాన్ని అందజేశారు. ఆయన చేపడుతున్న సామాజిక సేవ కార్యక్రమాలకు గుర్తింపుగా ఆయన ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. గణేష్‌బాబు మాట్లాడుతూ.. తన తల్లిదండ్రులు నేర్పిన సేవా దృక్పథంతోనే ఈ అవార్డు తనను వరించిందని వారికి రుణపడి ఉంటానన్నారు. ఈ అవార్డు తనలో మరింత ఉత్సాహం నింపిందని, ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపడతానన్నారు.

ప్రజలు బీజేపీని విశ్వసిస్తున్నారు : ఈటల



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

మల్కాజిగిరి: రాష్ట్రంలో బీజేపీని ప్రజలు విశ్వసిస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ మేడ్చల్, మల్కాజిగిరి అర్బన్ జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం మల్కాజిగిరిలో జరిగిన కార్యక్రమంలో ప్రారంభించారు. ఈటల మాట్లాడుతూ.. మొదటిసారిగా బీజేపీకి సభ్యత్వ నమోదు చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో 35 శాతం ఓట్లు సాధించిందని, అత్యధిక ఓటర్లు ఉన్న పార్లమెంట్ స్థానమైన మల్కాజిగిరిలో బీజేపీకి అత్యధిక ఓట్లు వచ్చాయన్నారు. మినీ ఇండియాగా ఉన్న మల్కాజిగిరి పార్లమెంట్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనపై అభిమానంతో గెలిపించిన ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ప్రదీప్‌కుమార్, కొల్లి మాధవి, మల్లారెడ్డి, గీతామూర్తి, బేతి సుభాష్‌రెడ్డి, రాణీ రుద్రమదేవి, బాలచందర్‌గౌడ్, మల్కాజిగిరి అసెంబ్లీ కన్వీనర్ డీఎన్. వెంకటేష్, కార్పొరేటర్లు రాజ్యలక్ష్మి, సునీతా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జన విజ్ఞాన సేవలు అభినందనీయం



విద్యార్థిని సత్కరించిన ఎమ్మెల్యే బండారి

మెడికల్ క్యాంప్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: సామాజిక బావనతో జనవిజ్ఞాన వేదిక అందిస్తున్న సేవలు అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చక్రిపురంలోని చక్రి విద్యానికేతన్ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక కాప్రా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సేవ కార్యక్రమాలతో పాటుగా ప్రజలను చైతన్యం చేయడం, మూఢ విశ్వాసాలను పారద్రోలడానికి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలకు తన సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యసేవలందించిన వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, స్థానిక నేతలు శివకుమార్‌గౌడ్, మహేష్‌గౌడ్, నర్సింహ్మా, అనిల్ ముదిరాజ్ వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభినందన..

నీట్‌లో 4924 ర్యాంకు సాధించిన నాగార్జున నగర్ కాలనీ పిట్టల నాగరాజు, శశికళ దంపతుల కూమార్తె సంజనను ఎమ్మెల్యే బండారి అభినందించారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించి మెడిసిన్ చదువుకు కావాల్సిన ఆర్థికసాయం అందజేస్తానని హామీ ఇచ్చారు.

యువతను చైతన్యపరచడమే జ్ఞానమాల

అల్వాల్: యువతరాన్ని చైతన్యం చేయడం కోసమే జ్ఞానమాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పీఎల్‌జి.శంకర్ అన్నారు. జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం కౌకూర్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ జర్నలిస్ట్ శ్రీరాములు, జ్ఞానమాల నిర్మాణ కమిటీ అధ్యక్షులు పోతురాజు శ్రీనివాస్, శ్యామలరావు, భాగ్యమ్మ, మంగాదేవి, నాగమణి, శ్రీనివాస్, బాలనర్సింహ, రవీంద్రనాథ్, బాలయ్య, నాగేశ్వర్, రాజు, శంకర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

- అల్వాల్ అంబేడ్కర్‌నగర్‌లో గంపల రాజయ్య, యాప్రాల్‌లో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు.

పల్లె పోరుకు రంగం సిద్ధం!

- ఓటరు జాబితా తయారీకి శ్రీకారం
- ఓఆర్‌ఆర్ లోపలి గ్రామాలు పురపాలికల్లో విలీనం పై చర్యలు
- గ్రామసభల్లో తీర్మానాలు... డీపీఓలకు లేఖలు
- నగర శివారుల్లోని 590 పంచాయతీల్లో 3 దశల్లో ఎన్నికల నిర్వహణకు కసరత్తు



సాక్షి, సిటీబ్యూరో: నగర శివారు మేడ్చల్–మల్కాజిగి, రంగారెడ్డి జిల్లాల్లో పల్లెపోరుకు రంగం సిద్ధమవుతోంది. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. వీలైనంత త్వరగా స్థానిక ఎన్నికలు పూర్తిచేయాలనే లక్ష్యంతో సర్కారు ముందుకెళ్తోంది. ఒకవైపు కులగణన తర్వాతే స్థానిక పోరు ఉంటుందని ప్రకటించిన ప్రభుత్వం.. తాజాగా స్థానిక పోరుకు సంబంధించిన ఓటరు జాబితా తయారీకి షెడ్యూల్ ప్రకటించింది. ఇప్పటికే ఓటరు జాబితా, వార్డుల రూపకల్పన తదితర అంశాలపై ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. జాబితాపూర్తయితే పోలింగ్ తేదీలు విడుదల కావాల్సి ఉంటుంది.

వచ్చే నెల 21న వార్డుల వారీగా జాబితా విడుదల

పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 29న ఓటరు జాబితా తయారీపై కలెక్టర్లలతో ఎన్నికల సంఘం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనుంది. సెప్టెంబర్ 6న వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రచురించనుంది. ముసాయిదాపై సెప్టెంబరు 7 నుంచి 13 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. అదే నెల 9న జిల్లాస్థాయిలో, 10న మండల స్థాయిలో ఎంపీడీవోలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సందేహాలు, అభ్యంతరాలపై చర్చిస్తారు. 19న జిల్లా పంచాయతీ అధికారులు అభ్యంతరాలపై తుది నిర్ణయం తీసుకుంటారు. 21న వార్డుల వారీగా ఓటరు జాబితా విడుదల చేస్తారు.

మూడు దశల్లో ఎన్నికలు...

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో 619 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఇందులో 29 గ్రామ పంచాయతీలు(రంగారెడ్డిలో 11, మేడ్చల్ జిల్లాలో 18) ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో సమీప పురపాలక సంఘాల్లో విలీనం చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. మిగిలిన 590 గ్రామ పంచాయతీల్లో మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశముంది. గతంలోనూ మూడు దశల్లోనే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. ప్రస్తుతం షెడ్యూల్ విడుదల కావడంతో ముందుగా సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహిస్తారని అందరూ భావిస్తున్నారు. అయితే రిజర్వేషన్ల విషయం కొలిక్కి రావాల్సి ఉండటంతో ఎన్నికల నిర్వహణపై భిన్నా స్వరాలు వినిపిస్తున్నాయి.

ఓఆర్‌ఆర్ లోపలి పంచాయతీల విలీనంపై

ఓఆర్‌ఆర్ లోపలి పురపాలికలు,గ్రామ పంచాయతీలను నగరంలో విలీనం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు జీవో కూడా జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే మంత్రి దామోదర రాజనర్సింహా ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీ దీనిపై అధ్యయనం చేస్తోంది. ఈ కమిటీ ఆమోదం తెలిపితే ఓఆర్‌ఆర్ లోపలి పంచాయతీలు నగరంలో విలీనం అయ్యే అవకాశాలు ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ పంచాయతీలను ముందస్తుగా సమీపంలోని పురపాలక సంఘాల్లో విలీనం చేసి పురపాలికల పాలకవర్గం గడువు ముగిసిన వెంటనే వాటిని నగరంలో విలీనం చేయనున్నట్లు పంచాయతీల్లో చర్చ సాగుతోంది. ఇదే జరిగితే రాజకీయ నిరుద్యోగం పెరుగుతుందనే భయం నాయకుల్లో వెంటాడుతోంది.

ఆశావహుల్లో...

పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసి ఆరు నెలలు దాటింది. జూన్‌లో మండల, జిల్లా పరిషత్‌ల పదవీ కాలం ముగిసింది. ప్రభుత్వం ఇంకా ఎన్నికల జోలికి వెళ్లలేదు. ఇదే సమయంలో ఆశావహులైన నాయకులు పంచాయతీలు, మండలాల్లో రూ. లక్షల్లో ఖర్చులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో శివారులోని పంచాయతీలే అధికంగా ఉన్నాయి. పంచాయతీలు పురపాలికలుగా మారినా రాజకీయ నిరుద్యోగం పెరుగుతుంది. సర్పంచి ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీ వ్యవస్థ కనపడదు.

రంగారెడ్డి జిల్లాలో...

రంగారెడ్డి జిల్లాలో 11 గ్రామ పంచాయతీలు సమీప పురపాలికల్లో విలీనానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. తారామతిపేట, గౌరెల్లి, బాచారం (పెద్దఅంబర్‌పేట), రషీద్‌గూడ, బహదూర్‌గూడ, హమీదుల్లా నగర్, చిన్న, పెద్ద గొల్కొండ (శంషాబాద్), మీర్జాగూడ(శంకర్‌పల్లి), హర్షగూడ (తుక్కుగూడ)గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

విలీనం జీపీలు ఇవే...

గ్రేటర్ హైదరాబాద్ పరిధిని అవుటర్ రింగురోడ్డు వరకు విస్తరించాలనే ప్రభుత్వ నిర్ణయానికి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 28 గ్రామ పంచాయతీలకు చెందిన పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు,ప్రజలు మద్దతు తెలిపినట్లు పంచాయతీశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఓఆర్‌ఆర్ లోపలి 18 గ్రామ పంచాయతీలను మాత్రమే సమీపంలోని పురపాలికల్లో విలీనం చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తుండగా, వీటితోపాటు మరో 10 గ్రామ పంచాయతీలు కూడా పురపాలికల్లో విలీనం చేయాలని తీర్మానం చేసి, డీపీఓకు లేఖలు సమర్పించటం చర్చనీయాంశమవుతోంది. మొదటగా గ్రామ పంచాయతీలను పురపాలికల్లో విలీనం చేసి, పురపాలక సంఘాల పాలక వర్గాల పదవీ కాలం ముగియకానే వాటిన్నింటిని నగరంలో విలీనం చేయనున్నట్లు తెలుస్తోంది.

మండలాల వారీగా గ్రామాలు ఇలా...

ఘట్‌కేసర్ మండలంలో అవుషాపూర్, అంకుశాపూర్, మాదారం, మర్పల్లిగూడ, ఎదులాబాద్, ఘనపూర్, వెంకటాపూర్, ప్రతాప సింగారం, కొర్రెముల, కాచవాణి సింగారం, చౌదరిగూడలు ఏకగ్రీవంగా తీర్మానం చేస్తూ విలీనానికి లేఖలు అందజేశాయి.కీసర మండలంలో గోధుమకుంట, కరీంగూడ,రాంపల్లి దాయర, బొగారం, చీర్యాల, నరసంపల్లి, తిమ్మాయపల్లి, కీసర, యాదార్పల్లి, అంకిరెడ్డిపల్లి ఉన్నాయి. శామీర్‌పేట మండలంలో శామీర్ పేట, బాబాగూడ, బొమ్మరాసిపేట, మేడ్చల్ మండలంలో గౌడవెల్లి, మునీరాబాద్, పూడూరు, రాయిలాపూర్ గ్రామాలు డీపీఓకు లేఖలు సమర్పించాయి.